క్లుప్తంగా

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌కు మాతృవియోగం



పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న తీగల కృష్ణారెడ్డి

బడంగ్‌పేట్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిగురింత నర్సింహారెడ్డి మాతృమూర్తి, కార్పొరేషన్ మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతరెడ్డి అత్త చిగురింత సరోజనమ్మ ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందింది. సోమవారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి బాలాపూర్‌కు విచ్చేసి ఆమె పార్థీవదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్పొరేషన్ ఉద్యోగులు, మహేశ్వరం నియోజకవర్గం నుంచి దేప భాస్కర్‌రెడ్డి, సింగిరెడ్డి పెంటారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నేతలు, మహిళలు, గ్రామస్తులు, పలు కాలనీ సంఘాల ప్రతినిధులు, పలువురు ప్రముఖులు విచ్చేసి నివాళులర్పించారు. అనంతరం బాలాపూర్‌లోని వైకుంఠ ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

నియామకం



ఎన్నికైన నూతన కమిటీ

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ సగర సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా అవుల బీచ్‌పల్లి ఎన్నికయ్యారు. సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మర్క సతీశ్, ప్రధాన కార్యదర్శి చిలుక శ్రీకాంత్, కోశాధికారి నాగరాల నారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు చింతల రవి, ప్రధాన కార్యదర్శి సాయికుమార్ పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడు బీచ్‌పల్లితో పాటు ప్రధాన కార్యదర్శిగా సంగిశెట్టి లింగస్వామి, కోశాధికారిగా చీర్ల నాగరాజులను ఎన్నుకున్నారు. సగరుల అభ్యున్నతికి నూతన కమిటీ పాటు పడుతుందని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలో గల మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విష్ణుప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. 6వ తరగతిలో అన్ని సీట్లకు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను మాత్రమే భర్తీ చేయనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీఎస్//తెలంగాణఅమ్స్ డాట్ సీజీజీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు దరఖాస్తుకు రూ.125, ఇతర విద్యార్థులకు రూ.200 చొప్పున పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 13వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. అదే రోజు 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

టోర్నీ నిర్వహణకు విరాళం



నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న దాత

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నీకి ఆ పార్టీ నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.50 వేల విరాళాన్ని సోమవారం టోర్నీ బాధ్యులకు అందజేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, నాయకులు రవీందర్‌యాదవ్, రమేశ్, ఆంజనేయులు, శ్రీను ఉన్నారు.

వైద్యురాలికి సన్మానం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చంద్రదన గ్రామం పల్లె దవాఖానాకు నూతనంగా డాక్టర్ నందిని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ తదితరులు సన్మానించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

వంట.. తంటా!



జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తున్న సిబ్బంది

- సకాలంలో అందని బిల్లులు, పెరిగిన నిత్యావసరాల ధరలు
- అవస్థల్లో మధ్యాహ్న భోజన కార్మికులు
- ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలని అభ్యర్థన

మీర్‌పేట: విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, సకాలంలో అందని బిల్లులు.. మధ్యాహ్న భోజన కార్మికులకు, ఏజెన్సీలకు సంకటంగా మారాయి. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిర్లాహిల్స్ ప్రాథమికోన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనం వండుతున్న తమకు బిల్లులు, వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఓ వైపు నిత్యావసరాలైన పప్పులు, కూరగాయలు, గుడ్లు, ఇతర వస్తువుల ధరలు పెరగడంతో అప్పులు చేసి మరి విద్యార్థులకు సకాలంలో భోజనం అందజేస్తున్నామని, తమకు రావాల్సిన బిల్లులు సమయానికి అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు.

ఎనిమిది నెలలుగా అందని వేతనాలు..

జిల్లెలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడుగురు మధ్యాహ్న భోజనం సిబ్బందికి ప్రతి నెలా రూ.3 వేల చొప్పున జీతం ఇవ్వాల్సి ఉన్నా.. ఎనిమిది నెలలుగా పత్తాలేదు. కేవలం బియ్యం సరఫరా చేసి వదిలేస్తున్నారు. దీంతో అప్పులు చేసి, మిగిలిన సరుకులు కొనుగోలు చేస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 మాత్రమే ఇస్తోందని, మార్కెట్లో గుడ్డు ధర రూ.7 పలుకుతోందని నిట్టూరుస్తున్నారు. దీంతో తమపై అదనపు భారం పడుతోందని, గుడ్లకు సంబంధించిన బిల్లు కూడా సమయానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిర్లాహిల్స్ పాఠశాలలోనూ మూడు నెలలుగా బిల్లులు అందని పరిస్థితి. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మధ్యాహ్న భోజనం వండే సిబ్బందికి ప్రతి నెలా బిల్లులు, వేతనాలు చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలి



చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు, జీతాలు అందకపోవడం బాధాకరం. ఇలా అయితే వారు బతకడం భారంగా మారుతుంది. సకాలంలో కార్మికులకు బిల్లులు అందేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకుంటే బాగుంటుంది.

– దాసరి బాబు, సీఐటీయూ బాలాపూర్ మండల అధ్యక్షుడు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా 21వ వార్డులో రూ.39.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు నిర్మిస్తున్నామన్నారు. ఒకప్పుడు నడిచి వెళ్లేందుకు కూడా వీలులేనట్లుగా ఉన్న రహదారుల స్థానంలో ప్రస్తుతం బీటీ, సీసీరోడ్లు వేశామన్నారు. పేదలు నివాసం ఉంటున్న దృష్యా బస్తీ దవాఖానాలను కూడా ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ షేక్ అఫ్జల్, కౌన్సిలర్ పల్లపు శంకర్, కమిషనర్ వెంకట్రామ్, నాయకులు షర్ఫుద్దీన్ హామెద్, యంజాల జనార్ధన్, సయ్యద్ హుస్సేన్, అలీ మన్సూరీ, నగేశ్, గోపాల్‌రెడ్డి, బర్కత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

'మహా కార్పొరేషన్'కు సన్నాహాలు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, యాచారం మండలాలను ఫోర్త్‌సిటీ పరిధిలో మహా కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తెలిపారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం, కందుకూరును మున్సిపాలిటీలుగా ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. మున్సిపాలిటీలుగా చేస్తే గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ పథకం వర్తించదనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఉపాధి హామీ పథకం వర్తించే విధంగా కార్పొరేషన్‌కు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ఔటర్ రింగు రోడ్డు పరిధి లోపల ఉన్న మున్సిపాలిటీలను ప్రస్తుతం ఉన్న పాలక మండలి సభ్యుల పదవీ కాలం ముగియగానే జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తుందన్నారు. వీటికి ఎన్నికలు జీహెచ్‌ఎంసీతో పాటు జరుగుతాయన్నారు. అప్పటి వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో మిగిలిన మున్సిపాలిటీలకు 100 రోజులలోపు ప్రభుత్వం ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు. ఫోర్త్‌సిటీ 320 ఫీట్ల రోడ్డు పనులను ఈ నెలలో ప్రారంభమవుతాయన్నారు. ఫోర్త్‌సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం, వినోదం, ఉపాధి కల్పన ఉంటుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సంపూర్ణ జ్ఞానంతోనే మోక్షం

త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి అధ్యక్షురాలు సద్గుణ



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: సంపూర్ణ జ్ఞానాన్ని సంపాదించినప్పుడే ప్రతీ వ్యక్తికి మోక్షం లభిస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను తెలియజేసేందుకు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సోమవారం ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గుణ మాట్లాడుతూ.. భగవద్గీత జ్ఞానం ప్రకారం క్రాంతి అంటే తిరుగుబాటు అని, సంక్రాంతి అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు అని సూచించారు. సుఖ, భోగ వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని, భోగి మంటలు అనే అగ్నిలో కోరికలు సకల కర్మలను కాల్చివేయాలని సూచించారు. కోరికలు, కర్మలు పూర్తిగా లేనట్లయితే ఉత్తరాయణం రోజు మోక్షంతో విముక్తి లభిస్తుందన్నారు. దక్షిణాయంలో చివరి రోజును భోగి పండుగ అంటారని, కర్మలు అనే కట్టెలు కాలిపోవాలనే సంకేతంతో భోగి రోజున కట్టెలను కాలుస్తారన్నారు. ప్రజలందరూ జ్ఞానులుగా, యోగులుగా మారి జ్ఞానాగ్నితో కర్మలను కాల్చుకోవాలని, ఈ సంక్రాంతి పండుగ అంతరార్థాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు కుల్దీప్‌రెడ్డి, ధన్వంతరి, సుధీర్, దినేశ్, శిరీష, వాసంతి, సాత్విక, నవ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, రైతులు

మొయినాబాద్‌రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్ కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం డైరెక్టర్ ప్రమాణస్వీకారం సందర్భంగా అజీజ్‌నగర్ గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో అజీజ్‌నగర్ మాజీ సర్పంచ్ మంగలి మంగరాములు, కొత్త మల్‌రెడ్డి, రాజిరెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మెట్రోను శంషాబాద్‌కు పొడిగించాలి



కేంద్ర మంత్రికి వినతి పత్రమిస్తున్న మహేందర్

శంషాబాద్: మెట్రో రైల్ ప్రాజెక్టును శంషాబాద్ వరకు పొడిగించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతి పత్రం సమర్పించారు. అలాగే ఎక్స్‌ప్రెస్ రైళ్ల కూడా శంషాబాద్ (ఉందానగర్) రైల్వే స్టేషన్‌లో ఆపాలని కోరారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో స్టాప్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ఫ్లైఓవర్‌కు వల్లభాయ్ పటేల్ పేరు పెట్టాలి



బీజేపీ నేతలను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

శంషాబాద్: అరాంఘర్ ఫ్లైఓవర్‌కు సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టాలని బీజేపీ నేతలు పట్టణంలో ఆందోళనకు దిగారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నేతలు డిమండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు దారుణంగా ఉందన్నారు. సీఎం డౌన్ డౌన్ అంటు నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌జీఐఏ పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అతిగా వ్యవహిరిస్తున్నారని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం స్వాధీనం



శంషాబాద్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన కేంద్రంపై శంషాబాద్ ఎస్‌ఓటీ అధికారులు దాడులు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలోని ఓ గోదాములో ఉన్న 13 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేశంపేట: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ అజాంఅలీ తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు రావాలని ఆయన కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ, బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లకు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న రూ.153 కోట్ల బకాయి నిధులను సీఎం విడుదల చేశారన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల నుంచి నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. అర్బన్ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసిందన్నారు. ఇందుకుగాను సీఎం చత్రపటానికి క్షీరాభిషేకం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రజా సంక్షేమ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని టీచర్స్ కాలనీ, నాగార్జునహిల్స్, వెంకటేశ్వరహిల్స్, చైతన్యహిల్స్, నందిహిల్స్ రోడ్ నెం–1 నుంచి 22 వరకు, ప్రశాంతిహిల్స్, 11కేవీ కేశవరెడ్డి ఫీడర్ పరిధిలో టీఎస్‌ఆర్‌నగర్, ప్రశాంతిహిల్స్ రోడ్ నెం–1, 2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట పోస్టాఫీస్, పోలీస్‌స్టేషన్, సీతాహోమ్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. అదేవిధంగా 11కేవీ అల్మాస్‌గూడ, తిరుమలనగర్, ఆర్‌జీకే, సీఎంఆర్, శివసాయినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని లెనిన్‌నగర్ ఏఈ వెంకటయ్య తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మరమ్మతుల కారణంగా..

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ మోహన్‌నగర్, భవ్య హాస్పిటల్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. 11కేవీ పసుమాముల ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన చర్చి నిర్వాహకులు



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: కుర్మల్‌గూడలోని ఇమ్మానియేల్ చర్చి నిర్వాహకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని సోమవారం కలిసి చర్చికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జీలకర్ర రవికుమార్, స్థానిక సంఘ పాస్టర్ బంగారి రమేశ్ మాట్లాడుతూ.. కుర్మల్‌గూడలో ఏర్పాటు చేసిన ఇమ్మానియేల్ చర్చిలో చాలామంది భక్తులు విచ్చేసి ప్రార్థనలు చేస్తారని గుర్తుచేశారు. కాని చర్చికి స్థిరమైన స్థలం లేనందున అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చర్చికి స్థలం కేటాయించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే సబితారెడ్డి స్పందిస్తూ అధికారులతో మాట్లాడి చర్చికి స్థలం కేటాయించేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు.

మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: యువజన సంఘాలు, నాయకుల సహకారంతో అభివృద్ధిలో మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో స్థానిక నాయకులతో కలిసి ఆమె అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. సాధారణ నిధులు సుమారు రూ.5లక్షలతో డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ప్రజలు, వ్యాపారులు పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు ప్రసన్నలత యాదయ్య, కోస్గి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌యాదవ్, ఆల్విన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, లక్ష్మయ్య, రాజిరెడ్డి, గోపాల్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం



రాజు దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీఓ హిమబిందు, సిబ్బంది

ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: ఉద్యోగంలో చేరిన ప్రతీ ఉద్యోగికి విరమణ అనేది ముందుగానే నిర్ణయించబడుతుందని, పని చేసినన్ని రోజులు అందరి మన్ననలు పొంది మంచి ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకోవడమే ముఖ్యమని ఎంపీడీఓ హిమబిందు అన్నారు. చేవెళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేసిన ఎం.రాజు పదవీ విమరణ సందర్భంగా సోమవారం కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు దంపతులను కార్యాలయ అధికారులు, సిబ్బంది పంచాయతీ కార్యదర్శులందరూ కలిసి ఘనంగా సన్మానించి ఆయనకు వీడ్కోలు తెలిపారు. రాజు తన శేష జీవితం కుటుంబసభ్యులంతో కలిసి ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, శంకర్‌పల్లి ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రమేశ్, సాయి, టైపిస్ట్ రాంచంద్రయ్య, సిబ్బంది గౌస్, శోభ, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాశాలలో వసతులు కల్పించాలని వినతి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.మహిపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ వెంకటరామారావుకు ఏబీవీపీ నాయకులతో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో చదువుకుంటారని, వారికి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. టాయిలెట్స్ ఉన్న వాటిని శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపోవటంతో అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆరోపించారు. విద్యావ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడి వెంటనే కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నితీశ్, కిషోర్, అనిల్, ప్రణయ్, వైశాలి, సింధు తదితరులు ఉన్నారు.